సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 39.009 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 171 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,522
3 శాతం జీఎస్టీతో	రూ.5,688
నవర (8 గ్రా)	రూ.45,504

గరిష్టం/కనిష్టం
41.1 /30.5

వాతావరణం
జిల్లా వ్యాప్తంగా సోమవారం అధిక ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలిలో 33 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

మంగళవారం । 6 । జూన్ । 2023

న్యూస్‌రీల్

98.68 శాతం మందికి పింఛన్ల పంపిణీ
నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ పూర్తయింది. 3,05,723 మంది లబ్ధిదారులకు గాను సోమవారం నాటికి 3,01,675 మందికి నగదు అందజేశారు. దీంతో 98.68 శాతం నమోదైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎండలను సైతం లెక్క చేయకుండా లబ్ధిదారులు ఉన్న ప్రాంతాలకు వెళ్లి కానుక అందజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(టౌన్): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా స్థానిక వెంకటేశ్వపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జిల్లా అటవీ సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణకు విద్యార్థులు ప్రధాన బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శ్రీనివాసులు, ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్ కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం



పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో సోమవారం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎం.పవన్‌కుమార్ పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో రైతు వద్ద నుంచి 30 క్వింటాళ్ల చొప్పున రూ.6,850 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కొనుగోలు కేంద్రం పరిధిలో 540 మెట్రిక్ టన్నుల పసుపును కొనుగోలు చేసే అవకాశముందన్నారు. అమ్మిన పదిహేను రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఉద్యాన అధికారి షాహిల్, కొట్టాలపల్లి సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ ప్రతినిధి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సార్.. న్యాయం చేయండి



సమస్యపై పోలీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 103 మంది వచ్చి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్ క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్యాంకులు, వివిధ కార్పొరేషన్లలో రుణాల ఇప్పిస్తామని పలువురు మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి స్పందనలో పాల్గొని పలు విషయాలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు.

జేసీబీ ఇప్పిస్తానని మోసగించారు

పోతిరెడ్డిపాళేనికి చెందిన అనురాధ ఎస్పీకి తమ సమస్యను తెలియజేశారు. కె.శ్రీనివాసులు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ కింద జేసీబీ ఇప్పిస్తానని నమ్మించాడని, అతని మాటలు నమ్మి రూ.18 లక్షలు ఇచ్చామని తెలిపారు. డబ్బులు తీసుకుని రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరగా స్పందించిన ఎస్పీ వెంటనే కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఉదయగిరి దుర్గం

ఉదయగిరి దుర్గంపై
గుప్త నిధుల ముఠా కన్ను

పూర్వం నుంచి కొనసాగుతున్న తవ్వకాలు
- రాయలు ఏలిన కోటలో నిధులకై అన్వేషణ
- ధ్వంసమవుతున్న ప్రాచీన కట్టడాలు
- తాజాగా పేలుడు పదార్థాల వినియోగం
- ప్రమాదవశాత్తు ముఠా సభ్యుడి మృతి

ఉదయగిరి: 400 ఏళ్ల చరిత్ర గల ఉదయగిరి దుర్గంపై అపారమైన గుప్త నిధులు ఉంటాయని కొంతమంది నమ్మకం. శ్రీకృష్ణ దేవరాయలు ఏలుబడిలో ఈ ప్రాంతంలో రత్నాలు రాశులు పోసి అమ్మేవారు అనే నానుడి ఉండేది. దీంతో ప్రాచీన కట్టడాల కింద గుప్త నిధులు ఉంటాయనే నమ్మకంతో ఎప్పటి నుంచో అనేక ముఠాలు గుట్టు చప్పుడు కాకుండా తవ్వకాలు సాగిస్తున్నాయి. కొన్ని ముఠాలు సంపద కొల్లగొట్టాయనే ప్రచారం కూడా ఉంది.

స్వాతంత్ర్యం అనంతరం నుంచి ఉదయగిరి దుర్గంలో గుప్త నిధుల వేట కొనసాగుతోంది. దుర్గంపై జన సంచారం లేకపోవడంతో ముఠాలు అక్కడేమి చేస్తున్నది వెంటనే తెలియదు. పైగా దుర్గంపైకి ఎవరూ తరచుగా వెళ్లరు. దీంతో రోజుల తరబడి ముఠాలు మకాం వేసి ప్రాచీన కట్టడాలను ధ్వంసం చేస్తున్నాయి.

గతంలో కూడా తవ్వకాలు

ఉదయగిరి దుర్గంపై ఉన్న కట్టడాల్లో బంగారం, వజ్రాలు దొరుకుతాయనే నమ్మకంతో కొంతమంది స్థానికులు పైపై తవ్వకాలు జరిపేవారు. అయితే బయట ప్రాంతాలకు చెందిన వారు పెద్ద స్థాయిలో తవ్వకాలు జరిపిన సంఘటనలు కూడా ఉన్నాయి. 2012లో ఉదయగిరిలోని కృష్ణ మందిరంలో కూడా ఓ ముఠా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపింది. దీంతో ప్రాచీన కట్టడాలు దెబ్బతిన్నాయి. అప్పుడు కొంతమంది అనుమానితులపై కేసులు నమోదు చేశారు.

పేలుడు జరపడం ఇదే మొదటిసారి

దుర్గంపై గతంలో అనేక ముఠాలు తవ్వకాలు జరిపాయి. కానీ తాజాగా జరిపిన తవ్వకాల్లో పేలుడు పదార్థాలు వాడటం, అందులో ఓ ముఠా సభ్యుడు మృతిచెందడం సంచలనంగా మారింది. గుట్టుచప్పుడు కాకుండా జరిగిన ఈ ఆపరేషన్ ఆలస్యంగా వెలుగులోకి రావడం.. ఓ వ్యక్తి చనిపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



పేలుడు జరిగినట్లు భావిస్తున్న ప్రాంతం



చోరీలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న ఏడుగురు స్నేహితుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులో ప్రదర్శించిన ఆభరణాలను చూస్తున్న ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, పక్కన ఏఎస్పీ హిమవతి.

వివరాలు 8లో

తుది దశకు ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ
- 1,802 మందికి తప్పనిసరి బదిలీలు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ తుది దశకు చేరింది. ఇప్పటికే జిల్లాలో 3,266 ఖాళీలు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. జిల్లా వ్యాప్తంగా 5, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న 1,802 మంది హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. ఈనెల 7వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంది. ఈనెల 9న బదిలీ టీచర్లు, హెడ్‌మాస్టర్లు వివరాల జాబితాను ప్రకటించనున్నారు. అయితే బదిలీల ప్రక్రియలో భాగంగా అభ్యంతరాలను జిల్లా విద్యాశాఖ అధికారులు సరిగా పరిశీలించలేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం సీనియారిటీ జాబితాను విడుదల చేయలేదని పలువురు టీచర్లు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 478 మంది తమ అభ్యంతరాలను తెలియజేశారు. ప్రధానంగా రీ అపోర్షమెంట్‌కు పాత పాయింట్లు తీసుకోలేదని చెబుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులకు ఇష్టారాజ్యంగా పాయింట్లు వేశారని ఆరోపిస్తున్నారు. బదిలీల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు చేసే తప్పుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని కొంతమంది ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నిర్ణీత గడువులోపు సమస్యలకు పరిష్కారం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

- అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం

నెల్లూరు (దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అర్జీదారుల నుంచి కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలు మళ్లీ రీ ఓపెన్ కాకుండా సరైన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. వినతుల పట్ల అలసత్వం చూపించకుండా వచ్చిన అర్జీలను చదివి పరిశీలించి పరిష్కరించాలన్నారు.

గుర్తింపులేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కలెక్టర్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల కోసం కలెక్టర్ హరినారాయణన్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు పడకుండా ప్రాంగణంలో ప్రత్యేకంగా కుర్చీలను ఏర్పాటు చేశారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి

జిల్లాలో చేపట్టిన రెండో విడత మన బడి నాడు–నేడు అభివృద్ధి పనులు పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖాధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పనుల పురోగతి, జగనన్న విద్యాకానుక కిట్స్ పంపిణీపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న దృష్ట్యా అసంపూర్తిగా మిగిలిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్స్‌ను ఈనెల 7వ తేదీ నాటికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి గంగాభవాని, సమగ్ర శిక్ష పీఓ ఉషారాణి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈలు అశోక్‌కుమార్, రంగ వరప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.



డీసీపల్లి వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు

పొగాకు ధరలు పైపైకి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): డీసీపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో కొనుగోలు కంపెనీలు ధరలు పెంచాయి. మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు సోమవారం 707 బేళ్లు వేలం కేంద్రానికి తీసుకురాగా 654 బేళ్లు రైతుల వద్ద కొనుగోలు చేశారు. 53 బేళ్లు వివిధ కారణాలు వల్ల తిరస్కరించారు. గత వేలం సీజన్లలో ఎన్నడూలేని విధంగా కిలో పొగాకుకు రూ.209 అత్యధిక ధర పలికింది. రూ.170 అత్యల్ప ధర నమోదు కాగా, సగటు ధర రూ.203.35 చొప్పున రైతులకు దక్కింది. ఈ వారంలో అధికారిక పొగాకు కొనుగోళ్లు ముగుస్తాయని ఆ తర్వాత పొగాకు బోర్డు మంజూరు చేసిన అదనపు కోటా బేళ్లు రైతుల వద్ద కొనుగోలు చేస్తామని వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ తెలిపారు.

పెనుగాలులకు రాలుతున్న కాయలు



గాలులకు రాలిపోయిన మామిడి కాయలు

మధుర ఫలం మామిడి సాగు ఈ ఏడాది ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. వాతావరణం అనుకూలించక.. అకాల వర్షాలు, గాలులకు కాయలు రాలిపోయి అన్నదాతలు నష్టపోతున్నారు. గతేదాదితో పోల్చుకుంటే ఈ సారి దిగుబడి తగ్గి సగం కాయలే కాశాయని అంటున్నారు. దీంతో ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని వాపోతున్నారు.

- ఆందోళనలో మామిడి తోటల రైతులు
- దిగుబడులు తగ్గి పెట్టుబడులూ రాని వైనం
- ఆశించిన స్థాయిలో రాని లాభాలు

జలదంకి: మామిడి గతేదాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దాదాపు సగానికి పైగా దిగుబడి తగ్గిపోయింది. దీని వల్ల తమకు నష్టాలే మిగిలాయని మామిడి రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక పోవడమే ఈ పరిస్థితికి కారణమని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో గాలులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో మామిడి చెట్లు విరిగి పోవడంతోపాటు కాయలు బాగా రాలిపోయాయి. ధరలు లేక, దిగుబడి రాక ఆశించిన స్థాయిలో లాభాలు లేవని రైతులు అంటున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో రైతులు వరి, పత్తి, మెట్ట పంటలు, బత్తాయితో పాటు మామిడి తోటలు కూడా సాగుచేస్తున్నారు.



రామవరప్పాడులోని మామిడి తోట

అధికారిక లెక్కల ప్రకారం నియోజకవర్గంలో సుమారు 4,600 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. జలదంకి మండలంలో ప్రధానంగా రామవరప్పాడు, చోడవరం, దాసరి అగ్రహారం, గట్టుపల్లి, తిమ్మసముద్రం, అన్నవరం, కేశవరం, వేములపాడు, బోయిలపాడు తదితర పంచాయతీల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ గ్రామాలతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. అయితే గతేదాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దిగుబడి తగ్గి సగం కాయలే కాశాయని రైతులు చెబుతున్నారు.

యాజమాన్య పద్ధతులే కీలకం

మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. ముందుగా చెట్టు చుట్టూ భూమి దున్నించడం, ఎరువులు వేయడం, చెట్ల మొదళ్లలో నీరు నిల్వ ఉండేలా చేయడం, పూత దశలో తేనెమంచు పురుగు, పేను కొరుకుడు తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం తదితర చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడి వస్తుందని చెబుతున్నారు. అయితే ఈ మేరకు యాజమాన్య పద్ధతులు పాటించినప్పటికీ ఈ ఏడాది పూతదశలో మంచు ఎక్కువగా కురవడం వల్ల తేనెమంచు పురుగు, పేనుకొరుకుడు పురుగు ఆశించి దిగుబడి తగ్గిందని రైతులు అంటున్నారు. దీనికితోడు గాలులతో కాయలు రాలిపోవడంతో తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నామని చెబుతున్నారు.

ధరలు అంతంత మాత్రమే..

ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి ధర ఆశాజనకంగా లేదు. ప్రధానంగా బంగినపల్లి మామిడికి టన్ను (1,000 కిలోలు) రూ.24 వేల వరకు, బెంగళూరు రసాలు, ఇతర రకాలకు రూ.12 వేల వరకు ఉంది. గతేదాది బంగినపల్లి కాయలు టన్ను రూ.40 వేలు ఉండగా, ఇతర రకాల కాయలు రూ.14 వేల వరకు పలికేవి. ఈ ఏడాది ధర లేక, దిగుబడి తగ్గి ఆశించిన స్థాయిలో ఆదాయం రాక నష్టాలే మిగులుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మామిడి తోటలకు ముందుగా అడ్వాన్సు చెల్లించి కౌలుకు తీసుకొని సాగు చేసే రైతులూ ఉన్నారు. వీరు ఎకరాకు రూ.25 వేల వరకు కౌలు చెల్లించడంతోపాటు యాజమాన్య పద్ధతులు, కాయ కోత, రవాణా ఖర్చులు కలిపి దాదాపు కౌలుకు రెట్టింపు భరించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధర, దిగుబడి రెండూ లేవు



మామిడి కాయల దిగుబడి ఈ ఏడాది ఆశించిన స్థాయిలో లేదు. ధర లేకపోవడంతోపాటు గాలులకు కాయలు రాలిపోయి నష్టపోతున్నాం. గతేదాదితో పోల్చుకుంటే ఈ ఏడాది సగానికి పైగా దిగుబడి తగ్గింది. నేను రామవరప్పాడులో 25 ఎకరాల మామిడి తోటను ఎకరా రూ.25 వేల చొప్పున కౌలుకు తీసుకున్నాను. అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.12 వేల వరకు నష్టపోయే పరిస్థితి ఉంది.

– తిరుపాలు, కౌలు రైతు, రామవరప్పాడు

మామిడి పంటను పరిశీలిస్తున్నాం



ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మామిడి పంటను పరిశీలిస్తున్నాం. ఈ ఏడాది తెగుళ్లతోపాటు గాలులు, అకాల వర్షం వల్ల దిగుబడి తగ్గింది. మామిడి సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. నష్టపోతున్న మామిడి రైతుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నాం.

– షేక్ షహీల్, ఉద్యాన శాఖ అధికారి, ఉదయగిరి

సకల వసతులతో పేదల ఇళ్ల నిర్మాణం



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- జగనన్న ఇచ్చిన స్థిరాస్తులను కాపాడుకోండి
- గృహ లబ్ధిదారులకు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న సూచన

కొడవలూరు: 'సకల వసతులతో పేదల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. సీఎం జగనన్న ఇస్తున్న స్థిరాస్తులను కాపాడుకుని భావి తరాలకు కానుకగా ఇవ్వాలి.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని గండవరంలో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు సొంతిల్లు ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి పట్టాలు ఇస్తున్నారని, అలాగే అన్ని వసతులతో గృహాలు కట్టిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 14 వేల మందికి స్థలాలిచ్చినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో స్థలం కోసం కాళ్లరిగేలా తిరిగినా ఫలితం ఉండేది కాదన్నారు.

రూ.9.52 కోట్లతో సంక్షేమం

గండవరం గ్రామానికే రూ.9.52 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందాయని ప్రసన్న తెలిపారు. గండవరం రోడ్డు అత్యంత దారుణంగా ఉండగా, గ్రామం మీదుగా 7 కి.మీ పొడవున రూ.2 కోట్లతో బీటీ రోడ్డు వేయించినట్లు తెలిపారు. గ్రామంలోని కల్వర్టు పడిపోవడం వల్ల ఇబ్బందిగా ఉందని రైతులు కోరినందున జెడ్పీ నిధులు లేదా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దాని నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. గ్రామంలో మంగళవారం కూడా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించడం ద్వారా నియోజకవర్గంలో 75 వేల గడపలు పూర్తి చేసుకుంటామన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా ఇచ్చిన రూ.1.16 కోట్ల రుణాలకు సంబంధించి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమాదేవి, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏపీఎం రుక్మిణి, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహన్‌కృష్ణ, అల్లం సత్యం, పెనాక శ్రీనివాసులురెడ్డి, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ఎస్‌కే ముజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అప్పుడెందుకు పూర్తి చేయించలేకపోయారు?

- ఆనంపై ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరోక్ష విమర్శలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): 'సోమశిల హై లెవల్ కెనాల్ పనులు 2013లో ప్రారంభించారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా, ఆ తర్వాత టీడీపీ హయాంలో ఆ పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పెత్తనం చేసిన వారు ఫేజ్ – 1, – 2 పనులు ఎందుకు పూర్తి చేయించలేకపోయారో గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలి.' అంటూ వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిపై ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరోక్షంగా విమర్శలు చేశారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో సోమవారం విక్రమ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలతో వైఎస్ జగన్ ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలుస్తుంటే వారికి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి హై లెవల్ కెనాల్ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పనులు ప్రారంభించి ఇప్పటికే 50 శాతం పూర్తి చేయగలిగామన్నారు. పడమటినాయుడుపల్లి, కంపసముద్రం రిజర్వాయర్ల ముంపు ప్రాంత నిర్వాసితులకు టీడీపీ హయాంలో నయా పైసా లబ్ధి జరగలేదని పనులు కూడా ఒక్క అంగుళం ముందుకు కదల్లేదన్నారు. ఇటీవల సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో మరుసటి రోజే కలెక్టర్, జేసీ ఆ రెండు గ్రామాలను సందర్శించి నిర్వాసితుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికే రెండు జాతీయ రహదారులు ఉండగా, మరో మూడు నెలల్లో బద్వేల్ నుంచి కృష్ణపట్నం పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభం కానుందని తెలిపారు. సంగం వద్ద లాజిస్టిక్ జోన్, ఆత్మకూరు మండలం నారంపేట వద్ద పారిశ్రామిక వాడ తదితర కార్యక్రమాలతో అభివృద్ధి విషయంలో వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు చెన్ను శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముటుకుందు లక్ష్మీరెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి లక్ష్మీరెడ్డి, షేక్ జమీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

లంచాలకు తావు లేకుండా పథకాల అమలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దగదర్తి మండలం చెన్నూరు గ్రామంలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతి కోసం వినూత్నమైన సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా సంక్షేమ పథకాల సారథిగా సీఎం ప్రసంశలు అందుకుంటున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లంచాలకు, వివక్షకు తావు లేకుండా, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో అందిస్తామని ఎగ్గొట్టిన సాయానికి దాదాపు రెట్టింపు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. ప్రభుత్వం కళ్యాణమస్తు, షాదీ తోఫాల కింద సాయం పొందడానికి పదో తరగతి ఉత్తీర్ణతను తప్పనిసరి చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జగనన్న అమ్మఒడి కింద రూ.15 వేలు, విద్యా దీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఏటా ఆర్థిక సాయం అందిస్తుండడంతో ఉన్నత చదువులు కూడా సాకారమవుతున్నాయని రామిరెడ్డి అన్నారు. ముందుగానే క్యాలెండర్‌ను ప్రకటించిన ఆ ప్రకారం పథకాలను సకాలంలో అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు అవగాహన కల్పించాలి



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్, అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): పిల్లలకు అతిసార వ్యాధి సోకినప్పుడు చేయించాల్సిన చికిత్సలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టర్ నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 19వ తేదీ వరకు అతిసార నివారణకు సంబంధించి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. వైద్యారోగ్య శాఖ డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, అంగన్‌వాడీ సెంటర్లలో తప్పనిసరిగా ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలన్నారు. డయేరియా వచ్చిన పిల్లలకు 14 రోజులపాటు జింక్ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్నేహితులే ముఠాగా ఏర్పడి చోరీలు

- నిందితుల అరెస్ట్
- రూ.30.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, చిత్రంలో ఏఎస్పీ హిమవతి, డీఎస్పీలు, సీఐ

నెల్లూరు(క్రైమ్): వారంతా స్నేహితులు. ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నారు. ఎట్టకేలకు వారిని నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కర్తం అవినాష్, నాగేంద్రబాబు అలియాస్ చిన్నోడు, సాయికృష్ణ అలియాస్ సాయి, ఎం.నరసింహులు అలియాస్ పిట్టోడు, ఏసీ నగర్‌కు చెందిన సీహెచ్ వంశీ అలియాస్ సరైనోడు, నవాబుపేటకు చెందిన దండు శేషగిరి అలియాస్ గిరి, తెలుగుగంగ కాలనీకి చెందిన జి.పవన్‌కుమార్ స్నేహితులు. వీరందరూ తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయసాగారు. గత నెల 22న గుడిపల్లిపాడుకు చెందిన కొండూరు శ్రీనివాసులు అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని 32 సవర్ల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి దొంగతనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారి సమీపంలో నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.30.50 లక్షల విలువ చేసే 85 సవర్ల బంగారు, కేజీ వెండి, బైక్, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలను స్వాధీనం చేసుకున్నారు.

అందరూ యువకులే..

ముఠా సభ్యులంతా యువకులే. ఆటో డ్రైవింగ్, పెయింట్, పాలిష్ తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మద్యం, జూదం వంటి వ్యసనాలకు బానిసయ్యారు. మద్యం తాగే క్రమంలో ఏర్పడిన పరిచయాలు స్నేహితులుగా మార్చాయి. వ్యసనాలకు సరిపడా డబ్బుల కోసం దొంగలుగా మారారు. మూడేళ్లలో ఏడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితులు ఆటోలు, మోటార్‌బైక్‌లపై తిరుగుతూ తాళం వేసిన ఇళ్ల వద్ద రెక్కీ వేసేవారు. ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం నేరాలకు పాల్పడేవారు. చోరీ చేసిన సొత్తును పంచుకుని జల్సాలు చేసుకునేవారు. 2020లో ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, 2022లో నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, 2023లో నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి రూ.లక్షలు విలువచేసే సొత్తును అపహరించారు. వాటిని సమంగా పంచుకుని జల్సాలు చేయసాగారు.

16 కేసులు

నిందితులందరి వయసు 30 ఏళ్ల లోపే. కర్తం అవినాష్ పాత నేరస్తుడు. ఆటో నడుపుతూ నేరాలకు పాల్పడసాగాడు. అతడిపై 16కు పైగా కేసులున్నాయి. బాలాజీనగర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, సస్పెక్టెడ్ షీట్ ఉంది. మరో నిందితుడు దండు శేషగిరిపైనా కేసులున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. అవినాష్ మినహా మిగిలిన వారిపై సస్పెక్టెడ్ షీట్లు తెరుస్తామని వెల్లడించారు.

సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు

ముఠాను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్సై షేక్ సుభాని, క్లూస్ టీం ఎస్సై వి.బ్రహ్మయ్య, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఐడీ పార్టీ ఏఎస్సై కె.గిరిధర్‌రావు, హెచ్‌సీలు జీవీ రమేష్, జి.గంగాధర్, పీసీ డి.పెంచలప్రసాద్, నెల్లూరు రూరల్ పీఎస్ హెచ్‌సీలు ఎస్.ప్రసాద్, జి.వేణుగోపాల్, కానిస్టేబుళ్లు షేక్ అల్లాభక్షు, జె.మునికృష్ణా, పి.శ్రీనివాసులు, క్లూస్ టీం పీసీ వి.వినయ్‌కుమార్ తదితరులను ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి వసంతోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు వసంతోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 160
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 170

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: విద్యుత్‌షాక్‌కు గురై ఓ వ్యక్తి ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం నెల్లూరు రూరల్ పోలీసులు వివరాలు వెల్లడించారు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆనంద్‌పటేల్ (27)మరో ముగ్గురు యువకులు జీవనోపాధి నిమిత్తం కొంతకాలం క్రితం నెల్లూరుకు వచ్చారు. పానీపూరి, బొరుగుల మిక్చర్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. రూరల్ పరిధిలోని జన్నత్ హుస్సేన్‌నగర్‌లో వారు గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఆనంద్ పటేల్ టేబుల్ ఫ్యాన్ వైర్‌ను విద్యుత్ బోర్డులోని ప్లగ్ నుంచి వేరుచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. సోమవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఆనంద్‌కు భార్య, పిల్లలున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ.10

భర్త మరణాన్ని తట్టుకోలేక..

- భార్య బలవన్మరణం
- టెక్కెమిట్టలో విషాదం



స్వర్ణలత మృతదేహం

నెల్లూరు(క్రైమ్): భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాదకర ఘటన నెల్లూరు టెక్కెమిట్టలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. టెక్కెమిట్ట రెండోవీధిలోని అయ్యప్ప టవర్స్‌లో డి.స్వర్ణలత (63), శర్మ దంపతులు నివాసం ఉంటున్నారు. స్వర్ణలత కస్తూరి దేవి స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పని చేసి రిటైరయ్యారు. ఆమె భర్త న్యాయవాదిగా పనిచేస్తున్నారు. వారికి సంతానం లేదు. దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఈనెల 3వ తేదీన శర్మ మృతిచెందారు. అదేరోజు కుటుంబసభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. భర్త మృతితో స్వర్ణలత కుంగిపోయారు. ఆమెకు తల్లి కృష్ణవేణి, చెల్లెళ్లు గీత, లలితకుమారి, తమ్ముడు వెంకటరమణ తోడుగా ఉంటున్నారు. ఆదివారం రాత్రి అందరూ కలిసి భోజనం చేసి నిద్రపోయారు. సోమవారం ఉదయం కృష్ణవేణి నిద్ర లేచి చూసేసరికి స్వర్ణలత తన భర్త ఆఫీస్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంది. దీనిని చూసిన తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ గట్టిగా కేకలు వేసింది. కుటుంబసభ్యులు నిద్ర లేచి స్వర్ణలతను కిందికి దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. మృతురాలి సోదరి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త మరణాన్ని జీర్ణించుకోలేక తన అక్క ఆత్మహత్య చేసుకుందని అందులో పేర్కొన్నారు. 48గంటల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతిచెందడంతో బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు రూరల్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం నెల్లూరు రూరల్ పోలీసులు వివరాలు వెల్లడించారు.. రూరల్ పరిధిలోని ముత్తుకూరు రోడ్డు బాబానగర్‌లో కుమార్, రోహిణి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కుమార్ బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. కొంతకాలంగా పని చేయకుండా మద్యానికి బానిసై భార్యను ఇబ్బందులు పెట్టసాగాడు. ఆదివారం డబ్బు కోసం రోహిణిని వేధించాడు. దీంతో భర్త ఇంట్లో లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన కుమార్ భార్య ఉరేసుకుని ఉండడాన్ని చూసి స్థానికుల సాయంతో నారాయణ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రోహిణి మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం రోహిణి తరఫు వారు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఉరేసుకుని..

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద గుర్తుతెలియని వ్యక్తి (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కథనం మేరకు.. సోమవారం స్థానికులు తిప్ప వద్ద మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జి.సంగమేశ్వరరావు ఎస్సైతో కలిసి వెళ్లి పరిశీలించారు. ఐదురోజుల క్రితం గుర్తుతెలియని యువకుడు తిప్ప వద్దకు వెళ్లి తన వద్దనున్న టవల్‌ను రెండుగా చింపి చెట్టుకు ఉరేసుకున్నట్లు భావిస్తున్నారు. విచారణలో ఆత్మహత్యగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దర్యాప్తులో వివరాలు తెలుసుకుంటామని ఎస్సై వెల్లడించారు.

10న నెల్లూరు నుంచి ఊటీకి బస్సు

నెల్లూరు సిటీ: ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు నెల్లూరు నుంచి ఊటీకి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ వన్ డిపో డీఎం మురళీకృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 7 గంటలకు ఊటీకి చేరుకుంటుందన్నారు. 12వ తేదీన తిరిగి నెల్లూరుకు బయలుదేరుతుందన్నారు. అప్ అండ్ డౌన్‌కు ప్యాకేజీ కింద రూ.2,898 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. బస్సు సర్వీసు నంబర్ 94810 అని, టికెట్లను www. apsrtc online. in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.